
# అజ్ఞాత రచయిత్రి



డా.వి.చంద్రశేఖరరావు

వెదురుపొద, వేణుగానం, తుళ్ళిపడ్డనది లాంటి పదో, యిరవయ్యో పదాలతో ఒక 'ఫేర్‌వెల్-నోటు' రాసి పత్రికలకు పంపితే, సాటి రచయితగా ఆమె గురించిన నాబాధ్యత తీరిపోతుంది. కానీ అట్లారాస్తే ఆమెనేకాక, ఆమె రచనల్ని కూడా అవ మానించినట్లు కాదా! ఉట్టుట్టి పదాలతో రచనల్ని, రచయితల్ని గుర్తు చేసుకోవటం సాహిత్య ప్రపంచంలో కొత్తేమీకాదు. వీలైతే కాస్తంత సెన్సేషనుకూరి, రచయిత చుట్టూ ఒక 'మిస్ట్'ని సృష్టించటము మనం ఎరిగిందే! ఈ తరహా సమీక్షలవల్ల రచయిత్రి రత్నమాలతికి యిప్పటికే ఎంతో అపకారం జరిగింది. ఆమెనో అనుమానంలాగో, మిత్‌లాగో మిగల్చటం చరిత్రకు అపచారం చెయ్యటమే!

OOO



పందొమ్మిది వందల నలభై ప్రాంతాల్లో మద్రాసులో వున్న తెలుగువాళ్ళకు పరిచితమైన పేరు డా.జ్ఞానప్రకాశం. కీల్‌పార్క్ హాస్పటల్‌లో డాక్టరుగా పనిచేసే ప్రకాశంను 'ఆంధ్రాఫ్రాయిడ్' గా చెప్పుకుంటారు జనం. డా.ప్రకాశం, ఇవాళ ఫెమినిస్టు రచయిత్రులు చెప్పే కఠోరసత్యాలను, ఆరోజుల్లోనే గొప్పగా ప్రచారం చేశాడు. ఆయన రాసిన ఎన్నో వ్యాసాలు సైకాలజీలోను, సోష ల్‌థీరీలోను సంచలనాన్ని సృష్టించాయి. అప్పట్లో 'హిందూ' దినపత్రికలో వారం వారం 'దికేస్– హిస్టరీ' అనే కాలమ్ రాసేవాడు. తన ప్రాక్టీసులో తటస్థపడ్డ స్త్రీల దుఃఖగాధలవి. సౌరభాల్ని వెదజల్లే నాజూకు పుష్పాల్లాంటి స్త్రీలు, మురికి కూపాల్లాంటి సంసారాల్లో ఎన్ని అగచాట్లు పడ్డారో, ఎంత రక్తమూ, కన్నీళ్ళు చిందించేవాళ్ళో సోదాహరణంగా వివరించేవాడు. ఒక విధమైన 'పారానోయా' కమ్మినట్లుగా కులాలకు, ఆర్థికస్థాయీ భేదాలకు అతీతంగా, ఒక దుఃఖాన్ని, విషాదాన్ని మోస్తున్నట్టుగా వుండేవారని, కుటుంబ సంబంధాల్లోని బోలుతనమే ఈ విషాదాలకు కారణమని తన వ్యాసాల్లో వివరించేవాడు. తను చేస్తున్నది సైకో–థెరఫీ అనే అనుమానం రాకుండా, వాళ్ళ దుఃఖగాథల్ని, వాళ్ళ లైంగిక విషాదాల్ని వాళ్ళ నోటితోనే చెప్పించి, వాళ్ళలో 'ఎవేర్‌నెస్' కలిగించిన తీరును కూడా వివరించాడా వ్యాసాల్లో.

రత్నమాలతి, తన 'నడిచివెళ్ళిన దారి' (1991) నవలలో నలభైలనాటి చరిత్రను మళ్ళీ రిక్రియేట్ చేసింది. డా.ప్రకాశం పాత్రద్వారా ఆకాలపు స్త్రీల జీవితాన్ని పరిచయం చేసింది. డా.ప్రకాశం జీవితమూలల్లోకి ఎవరూ స్పృశించని ఆయన ప్రణయగాథల్లోకి ప్రయాణించగలిగింది. రెండో ప్రపంచయుద్ధం తరువాత దేశంలో ముసిరిన ఆర్థికమాంద్యం, కుటుంబ వ్యవస్థలో లైంగిక ప్రవర్తనలో వస్తున్న కొత్త ఆలోచనా ధోరణులు, ఎడ్లర్, యంగ్‌ల వ్యక్తిత్వవాదం, మార్క్సిజం , సక్రియలిజం, ఈ నేపథ్యంలో ఆకలి, కవిత్వం, చలం రచనలు, ఫ్రాయిడ్ ఆలోచనలు ఊపిరిగా ఎరిగిన జ్ఞాన ప్రకాశాన్ని చారిత్రక వీధుల్లోంచి పెకిలించి మనముందుంచే ప్రయత్నం ఈ నవల.

డా. ప్రకాశం జీవిత చరిత్రగా మొదలు పెట్టిన నవల/ క్రమంగా రచయిత్రి అదుపును దాటి స్త్రీల దుఃఖచరిత్రగా మారింది. ఒక్కో స్త్రీ మూర్తి పాఠకుడి ఎదుట నిలిచి సాశ్రువై తన దుఃఖగాధను వినిపిస్తున్నట్టుగా ఫీలవతాము నవల చదువుతున్నప్పుడు. మొత్తం ముప్పయి రెండు అధ్యాయాలున్న ఈ నవలలో ఒక్కో అధ్యాయంలో ఒక్కో స్త్రీ గురించిన కథ వుంటుంది. మొదటి రెండు అధ్యాయాలలో ప్రకాశం బాల్యం, చదువు గురించిన వివరాలున్నాయి. మూడో అధ్యాయంలో 'లలిత' గురించిన కథ వుంటుంది. భర్తను హత్య చెయ్యాలని కొన్ని వందల రాత్రులు, పగలు మథనపడి, చానాళ్ళపాటు ఉల్లిపాయల్ని కోసే కత్తిని పర్సులో పెట్టుకొని తిరిగేది. నాలుగువ అధ్యాయంలో పూర్ణకథ. భర్త ముందుకొయ్యలా బిగుసుకు పోయేదా అమ్మాయి. అతను లేని క్షణాల్లో పూలవనంలా తిరిగేది. రాత్రి పడకలో అతనో కొయ్యతో పోట్లాడినట్లుగా పోట్లాడి చివరకు "కొజ్జాదానా!" అంటూ అసహ్యంగా తిట్టేవాడు. ఒక కాంచనమాలకో, ఒక గ్రేటా గార్బోకో ధీటైన అందం ఆ అమ్మాయిది. ఐదో అధ్యాయంతో రమణి పాత్ర ప్రవేశిస్తుంది. నవలకు కథానాయిక పాత్ర అనవచ్చు ఈ రమణిని. ఈ నవలలో ప్రస్తావించిన స్త్రీల కథలన్నీ డా.ప్రకాశం రికార్డు చేసిన కేస్‌హిస్టరీల నుంచి తీసుకున్నవే. ఒక్క రమణి పాత్ర మాత్రం పూర్తిగా రచయిత్రి కల్పన.

అందమైన ఇరవైయేళ్ళ గ్రాడ్యుయేట్ రమణి. రమణికి ఆర్మీమేజర్‌తో పెళ్ళి అవుతుంది. వయసులో చాలా అంతరమున్న మేజర్ కంటికి రమణి రుచికరమైన ఆహారపదార్ధంలా కన్పిస్తుంది. యుద్ధరంగానికి వెళ్ళేముందు రమ్ము, వోడ్కా, రమణి అతనికి ఉత్తేజాన్ని యిస్తాయని చెప్పకునేవాడు. మెత్తని, మృదువైన పచ్చిక బయళ్ళలో, వార్‌టాంక్ బలిమిని తొక్కుకుంటూ వెళ్ళినట్లుంటుంది. వాళ్ళ మధ్య అనుబంధం. మేజర్ యుద్ధరంగంలో వుండగా రమణికి డా.ప్రకాశంతో పరిచయం అవుతుంది. ప్రకాశం ఆమెకు తన పేషంట్లను చూపిస్తాడు. వాళ్ళ గుండెలోని వ్యధను వినిపిస్తాడు. కుటుంబాలన్నీ యుద్ధభూములై, క్షతగాత్రులుగానో, శవాలుగానో స్త్రీలు మిగిలివున్నారని వివరిస్తాడు. క్రమంగా రమణి పాత్రను మార్పుకు, తిరుగుబాటుకు సింబాలిక్‌గా మార్చుతుంది రచయిత్రి. మేజర్ తుపాకీతో తన్నుతాను కాల్చుకొని ఆత్మహత్య చేసుకుంటాడు. మేజర్ చనిపోయిన స్థలంలోనే (డ్రాయింగ్‌రూమ్‌లో) ప్రకాశంది నిలువెత్తు ఫోటో పెడుతుంది రమణి.

ఈ నవల సీరియల్‌గా వస్తున్న రోజుల్లో రచయిత్రి స్త్రీల దుఃఖాల్ని మరీ ఎక్కువగా రొమాంటిసైజ్ చేస్తుందని విమర్శ వచ్చింది. ఏ ఒకరో, యిద్దరో మొత్తం స్త్రీ ప్రపంచానికి ప్రతినిధులైనట్లు రాసిందని ఆరోపణ. చాలా చోట్ల మొరటుగా, పచ్చిగా రాసిందని, ఆ ప్రాసెస్‌లో ప్రకాశం పాత్ర వైశిష్ట్యం దెబ్బతిందని విమర్శకులు అన్నారు. ఈ విమర్శలను అంతగా పట్టించుకోనవసరం లేదు. ఫెమినిస్ట్ భావన తెలుగు విమర్శకుడికి యింకా జీర్ణం కాని పదార్థం.


నడిచి వెళ్ళిన దారి సీరియస్ నవల. ఉద్యమ నవల. ప్రకాశం కోసమేకాదు వందలాది స్త్రీ మూర్తుల దుఃఖగాథలకోసం చదవాల్సిన నవల. స్ట్రీమ్ ఆఫ్

కాన్షస్‌నెస్‌లో సాగే ఈ నవలను ఈ దశాబ్దపు ఉత్తమ నవలగా చెప్పుకోవచ్చు. (1991 వ సంవత్సరానికి ఉత్తమ నవలగా అవార్డునుకూడా గెలుచుకుంది ఈ నవల.)

నవల విడుదలైన ఆరునెలలకు ఒక ఇంటర్వ్యూలో కొన్ని వింత నిజాన్ని బయటపెట్టింది రచయిత్రి. "దాదాపు పదేళ్ళపాటు రీసెర్చిచేసి రాసిన నవల యిది. నవలలో కన్పించే చాలామంది స్త్రీలు ఇంకా బ్రతికే వున్నారు. వాళ్ళను కలిసి, వాళ్ళ జ్ఞాపకాల్లోంచి అప్పటి సంఘటనలను విని, వాటిని ప్రకాశంగారి రికార్డులతో పోల్చుకుని ఆ తరువాతనే నవలా రచన ప్రారంభించాను.

డా.ప్రకాశంగారి జీవితంలోకి తొలుచుకుంటూ వెళ్ళేకొలది ఊహించని కొన్ని నిజాలు బయటపడ్డాయి. రమణిపాత్రను సృష్టించాక తప్పిందికాదు. రమణిపాత్ర ఎవరో కాదు. మా అమ్మే!"

రత్నమాలతి ఏం చెబుతుందో అర్థమయ్యే సరికి చాలామంది పాఠకులకు దాదాపు మతిపోయింది. ప్రకాశం తన తండ్రి అంటూ ప్రకటించటము వార్తాపత్రికలకు కావలసినంత సెన్సేషను. డా.ప్రకాశాన్ని ఎరిగినవాళ్ళు ఆయన




బంధువులు ఈ విషయంపై తీవ్రంగా విరుచుకు పడ్డారు. ఈ లోపుగా రత్నమాలతి భర్త (ఇద్దరు యిప్పుడు కలిసి వుండటంలేదు) మాలతి మానసిక ఆరోగ్యం సరిగాలేదని, ఏదయినా నవల పూర్తిచేసిన తరువాత నాలుగైదు నెలలపాటు విపరీతమైన మానసిక ఒత్తిడికి గురై అన్‌కంట్రోలబుల్‌గా అయి పోతుందని పత్రికాముఖంగా చెప్పాడు. రెండుమూడు సార్లు సైక్రియాట్రిస్టు సహాయం తీసుకోవలసి వచ్చిందని కూడా చెప్పి, అట్లాంటి మానసిక స్థితిలోనే ఈ ఇంటర్వ్యూ యిచ్చి వుంటుందని, అంచేత ఆవిడ చెప్పిన విషయాలను అంత సీరియస్‌గా తీసుకోనవసరం లేదని చెప్పాడు.

ఆ మరుసటి రోజే "దట్ బాస్టర్డ్ హేజ్ నో బిజినెస్ టు టాక్ ఎబౌట్ మీ!" అంటూ పేపర్లో రిజాండర్ ఇచ్చింది రత్నమాలతి.

"వాణ్ణి మనిషి అనడానికే మనసు ఒప్పదు. పైగా క్రిటిక్‌నంటూ పెద్దఫోజు. కంటికి నదురైన స్త్రీ కనబడగానే జంతువులా మారిపోయే వాడికి మనసు గురించీ, దాని తీరు గురించి ఏం అర్థం అవుతుంది?"

"నా మనస్సును ఛిద్రం చేశాడు. జీవితాన్ని డొల్లచేశాడు. వాడు ముట్టుకు న్నంతమేరా తగలబడి పోయింది నా జీవితం. స్త్రీ పురుష సంబంధాలంటే పడకగదులు, కండోములు, బ్లూఫిల్మ్‌లు, అవసరమైతే అబార్షన్లు అని మాత్రమే వాడికి తెలుసు. వాడికి డా.ప్రకాశం పేరు సైతం ఉచ్చరించే అర్హతలేదు.

'మళ్ళీ చెబుతున్నాను ప్రకాశం నా తండ్రి. తండ్రంటే తాళిగట్టటాలు, సంసారాలు వెలగబెట్టటాలు, నా పెళ్ళాం, నా పిల్లలు ఆపైన నా మగతనం అని ఊరేగటంకాదు. నా జన్మకు కారణమైన వాడని!!

"అయన్నిట్టా వివాదంలోకి లాగటం నా ఉద్దేశంకాదు. అంతేకాదు ఆయన పేరును తోకగా తగిలించుకొని నేనుసైతం ఎగరాలనే కోరిక కూడా నాకులేదు."

"ఒక నిజాన్ని చెప్పాను. రచయితగా అది నాబాధ్యత. జనం యిష్టాయి ష్టాలతో నాకు సంబంధంలేదు. నమ్మండి! లేకపోతే చావండి!"

ఈ రిజాండర్ యిచ్చినవారం రోజులకే రత్నమాలతిని ఒక ప్రైవేట్ హాస్పటల్‌లో చేర్పినట్టు వార్త వచ్చింది. తీవ్రమైన ఉన్మాదంతో తనను తాను చంపుకోను ప్రయత్నించినట్టు వార్త వచ్చింది.

పరమేశ్వరరావు, పి.ఎస్.రావు పేరుతో గొప్ప రచయితగా ప్రసిద్ధుడు. గొప్పరచనలేం చేయకపోయినా విమర్శకుడిగా మంచిపేరుంది. రత్నమాలతి రచయితగా ఎదుగుతున్న తొలిరోజులలో ఒకానొక సభలో తటస్థపడ్డాడు పి.ఎస్.రావు. మాలతికి పేరు తెచ్చిన మరో మంచి నవల పయనం (1980) పి.ఎస్. రావుగారి పర్యవేక్షణలో రాసినదిగా చెప్పుకుంటారు. ఆ నవల విడుద లైన నెల రోజులలో రత్నమాలతి పి. ఎస్.రావుకు సహచరిగా తరలివచ్చింది. ఇద్దరికీ ఇరవై యేళ్ళ వయసు అంతరం వుంది. పి.ఎస్.రావుకు మూడేళ్ళ మనవరాలు కూడా వుంది. ఆ తరువాత నాలుగేళ్ళలో మాలతి, కుముదిని పెంపుడుపిల్ల ఆత్మకథ (1982), మోహం (1983), ఆత్మచెప్పిన కథలు (1984) వ్రాసింది. రచయిత్రిగా మాలతి బెస్ట్ పిరియడ్ ఈ కాలమే.

పరమేశ్వరరావు చెప్పిన అసాధారణ ప్రవర్తన మాలతిలో ఇదివరకు వుంద నడానికి దాఖలాలేమీ లేవు. అయితే ఆమె రచనలన్నీ ఎంతో ఉద్వేగంగా, ఎమోషనల్ హైట్స్‌లో రాసినట్లుగా వుంటాయి. ఆమె మొదటి రచన ప్రయాణం (1970) ఒక యాభయ్యో, అరవయ్యో ఉత్తరాలు ఒక నవలగా కూర్చినట్టు వుంటుంది. కాలేజ్‌లో చదివే రోజులవి. ఆ రాసిన ఉత్తరాలు ప్రేమలేఖలే. ఒక హిస్టరీ టీచర్‌ను ఉద్దేశించి రాసినవి. నాలుగేళ్ళ తరువాత వాటిని సరిదిద్ది నవల రూపంలో కూర్చి ఆమె చేతిలోనే పెట్టాడా టీచర్. ఆ నవలను గురించి చెబుతూ రోడ్డుపక్క దొరికిన ఒక పాతపుస్తకం నా ఆలోచనల్ని, ఆవేశవివేకాల్ని పూర్తిగా మార్చివేసింది. ఆ పుస్తకం పేరు మ్యూజింగ్స్ (చలం రాసింది) పెన్నిధి దొరికినట్టు, దాహం ఏదో తీరినట్టు, ప్రశ్నలకేవో సమాధానాలు దొరికినట్టు, నిస్త్రాణ అయిన ప్రాణానికేదో అమృతధార దొరికినట్టు అనిపించింది ఆ పుస్తకాన్ని చదివినప్పుడు. ఆ పుస్తకం చదివిన ఎంత ఉద్వేగంతో, కసో, కవితో, మరే ప్రక్రియో అర్థం కానిదేదో కాగితాల పొడవునా బరకటం మొదలుపెట్టాను. అవన్నీ నా 'ప్రభు' కోసం (ప్రభాకర్ కోసం) రాసుకున్న ఉత్తరాలు.'

ప్రభాకర్‌తో మాలతి పరిచయం కాలేజ్‌లో ఒక స్కాండల్ అయ్యింది. దేన్నయినా చిత్తశుద్ధితో, హృదయ పూర్వకంగా చేయటం రత్నమాలతి కలవాటు. ప్రభాకర్‌తో స్నేహంకూడా అట్లాగే చేసింది.

"ఒక ఇంద్రధనస్సులా, ఒక పూలచెట్టులా, మహాసముద్రంగా ఉప్పొంగిన రోజులవి. నా లేత స్వప్నాలకు రంగులు పులిమిన ఇంద్రజాలికుడు అతను. వాస్తవానికి, స్వప్నానికి పెద్దగా తేడా తెలియని రోజులవి, ఒక స్పర్శకోసం, అనునయం కోసం వెంపర్లాడే రోజుల్లో అతను ఒకడుగా కాక ఆత్మల సముదాయంగా మారిపోయాము." అంటూ ప్రభాకర్‌తో తన స్నేహాన్ని గురించి ఒక పుస్తకంలో రాసుకుంది (ముందుమాటలో). అయితే ఈ స్నేహం చివరకు ఒక అబార్షన్‌గా ముగిసింది.


రత్నమాలతి కాలేజి నుంచి బయటకు వచ్చే రోజుల్లో ఒక వారపత్రిక

నిర్వహించిన నవలల పోటీలో రత్నమాలతి నవలకు మొదటి బహుమతి వచ్చింది. దానిపేరు స్రవంతి (1973). ఆ నవల, రత్నమాలతికి రచయితగా ఒక గొప్ప మలుపు. అయితే కాలేజిలో, స్నేహితుల మధ్య 'పెద్ద కేసుగురూ! ' అనే యిమేజి ప్రచారంలోకి వచ్చింది. స్రవంతి నవల అదుపులేని ఒక ప్రవాహంలా సాగింది. లైంగికభావాల్ని, ప్రేమ అనే రహస్య ప్రక్రియని నిర్లజ్జగా చెప్పటం వాళ్ళకోవింత. రంగు కాగితంలో పాక్‌చేసినట్టు కనపడీ కనపడనట్లు స్నేహాల్ని, సెక్స్‌ని చదవటం అలవాటయిన పాఠకుడికి, రత్నమాలతి ఉద్వేగపు వేగం కంగారు పుట్టిస్తుంది. ఆ రోజుల్లో ఆనవల పెద్ద సెన్సేషను. నీతులు, విలువలూ, ధర్మసారాల్ని తిరస్కరించి, ప్రాతివత్యపు ముసుగుల్ని పరపరా చించివేసి 'స్వేచ్ఛాప్రణయం' అనే కొత్త స్త్రీ, పురుష సంబంధమైన 'భావన'ను ప్రచారం చేస్తుందా నవల. మాలతికి యిష్టమైన, దగ్గరైన చాలామంది స్నేహితుల్ని పోగొట్టుకునేలా చేసింది ఆ నవల.

రత్నమాలతికి ఆ తరువాత కొద్ది రోజులకే పెళ్ళి జరిగింది. రెవిన్యూ ఆఫీసు గుమస్తా అతను. మూర్ఖుడు. తన పురుషాహంకారపు పంజాతో మాలతిని స్పృశించాడు. అతని కలయికలో ఆనందంకన్నా అనంతమైన దుఃఖం రావటం రత్నమాలతికి కొన్నాళ్ళు అర్థంకాలేదు. "ఎవడితోనో తిరిగావట కదా!" అతని ఊతపదం. క్రమంగా అతనిపై విసుగూ, ద్వేషం కలిగాయి మాలతికి. సంసార వృక్షానికి ఉరిపోసుకోవటమా, లేదా దాన్ని చేధించి బయటకు రావటమా! తేల్చుకోవాల్సి వచ్చింది. ఆరు నెలలకే మొగుడు చెర వదిలించుకుంది.

తన మొదటి వివాహం గురించి గుర్తుచేసుకోవటం మాలతికి యిష్టం వుండదు. పి.ఎస్.రావుతో జరిగిందే తన అసలైన పెళ్ళి అంటుంది.

భర్తను వదిలేసి వచ్చిన తరువాత చాలా ఏళ్ళపాటు మాలతి రచనలేం చేయలేదు. బాల్యపు జ్ఞాపకాలేవో నులిపెట్టగా ఒక సెంటిమెంటల్ నవల రాసింది. అంతగా పేరు తెచ్చుకోని ఆ నవల పేరు 'నాన్న కనిపించటంలేదు' అది చాలా వరకు ఆటోబయోగ్రఫికల్‌గా సాగుతుంది.




తల్లీతండ్రీ విడిపోయిన ఒక కుటుంబంలో పిల్లలు నలిగి పోవటం కథా వస్తువు. పార్వతి నవలలో ముఖ్యపాత్ర. ఇద్దరు చెల్లెళ్ళు, తమ్ముడు, తల్లి ఆమెపైన ఆధారపడతారు. మొగుడు వదిలేసిన భార్యగా తల్లిని గురించి చెప్పకుంటారు. తండ్రిపై ద్వేషం కన్నా, ఆయన్ను చూడాలనే ఆరాటం పిల్లల్లో కన్పిస్తుంది. నవల ముగింపు చాలా అసహజంగా, రొమాంటిక్‌గా వుంటుంది. పార్వతి పెద్ద ఇండస్ట్రీకి మేనేజర్ అవుతుంది. ఆ ఇండస్ట్రీకి యజమాని తండ్రేనని తెలుస్తుంది చివర్లో. అసహజమైన కథావస్తువుతో వున్న ఈ నవల్లో పిల్లలు తండ్రికోసం పడే ఆరాటం మాత్రం హృద్యంగా వుంటుంది. ఆ ఆరాటం రత్నమాలతి స్వయంగా అనుభవించిందే.



## భరతవాక్యం



పొద్దుపొద్దున్నే వాడి కళ్ళవాకిళ్ళు చీపురుకట్టతో ఎంత ఊడ్చినా
వాడి అహం నిద్ర విచ్చుకోదు –

పౌడర్‌తోనో, సోడాతోనో... వాడి మనసు బండలెంత కడిగినా
బండ మనసుకు పట్టిన పాకుళ్ళు పరారీకావు –

మసిపట్టిన వాడి చెవుల గిన్నెలెంత తోమినా
నీ వేదన వినిపించదూ... కృతజ్ఞతా మెరుపులూ అగుపించవు –

దినం దినం వాడి అంగారపు బట్టలెంత ఉతికినా, పిండినా
ఒక్క సానుభూతి చుక్కా రాలదు–

పొయిలో నువ్వు కట్టెవయినా కూర పాత్రలో వాని హృదయం ఉడకదు –
పేగులు చుట్టుకుపోయే బాధతో గుండెలవిసేలా ఏడ్వు–
నీ రాగంతో మడొన్నా నూహిస్తూ వాడు స్వప్నస్ఖలనం చేసుకుంటాడు!

ముగింపొక్కటే మిగిలింది!
వాడి అవయవాలన్నీ కత్తిపీటతో తెగ్గోస్తూ
గుమ్మడికాయ గురుతు తెలీకుండా చెక్కాలి –
గుడుగుడుగుంజం గుండేరాగం పాటలు గునపాలై లేవాలి!

– మోహన్ రుషి

(క్షణం క్షణం ఛస్తూ, బతుకుతూ భర్తల సేవల్లో అం'తరిస్తున్న' భార్యలందరికీ నమస్సుల్తో... విన్నపంగా...)

రత్నమాలతికి తన తండ్రి ఎవరో తెలియదు. తల్లి ఎప్పుడూ చెప్పలేదు. అదో అర్థంకాని ఫజిల్ మాలతికి. తల్లి (సుగుణ ఆమెపేరు.) తన భర్త విషయం గురించి ఎంతో గర్వపడటం మాలతికి ఆశ్చర్యం వేస్తుంది.

"నాకు భర్తలేడు. ప్రియుడున్నాడు!" అని చెప్పకునే సుగుణ మాలతికి ప్పటికీ ఒక ఐడియల్–షి. ఒక సీనాగుప్త సాహసాన్ని బుగ్గలు నొక్కుకుంటూ ఆశ్చర్యంగా చెప్పకునే ఈ తరం అమ్మాయిలకు యాభైలనాటి ఈ ముచ్చట ఒక పట్టాన జీర్ణంకాదు. మాలతి అమ్మమ్మమాత్రం (మాలతి వాళ్ళ దగ్గరే పెరిగింది) అల్లుడు యుద్ధంలో పెద్ద ఆఫీసరని, దేశదేశాలు తిరుగుతుంటాడని అందరితో చెప్పకునేది.

తండ్రిలేకపోవటం అనే లోటు మాలతి ఎప్పడు ఫీలయ్యేది. తండ్రి అనే ఊహచుట్టూ ఎన్నెన్నో కలల్ని అల్లుకొని మురిసిపోయేది. బాల్యపు ఫాంటసీలను తన కథల్లో రాసుకునేది మాలతి.

మాలతి బాల్యం దుర్భరమైన దారిద్ర్యంలో గడిచిపోయింది. పెద్దగ్రామంగా చెప్పకునే గుంటూరులో ఒక మూలన పావు పరక పొలంతో రెండో మూడో పాడిగేదెలను పెట్టుకొని అమ్మమ్మ, తాత వెళ్ళబుచ్చిన సాదా సీదా జీవితంలో మనసుకూ, శరీరానికి పోషణలేకుండా పెరిగింది మాలతి. మాలతికి పదేళ్ళ వయస్సులో సుగుణ ఇంటిలోంచి అదృశ్యమైంది. మదర్‌థెరిస్సా నడిపే ముసలివాళ్ళ హాస్టటల్‌లో నర్సుగా పనిచేయడానికి వెళ్ళిపోయిందని మాలతి, వాళ్ళ అమ్మమ్మ గట్టిగా నమ్మేవాళ్ళు. మద్రాసు కేన్సర్ హాస్పటల్లో పేషంటుగా చూశామని ఆ తరువాత నాలుగైదు యేళ్ళకు మాలతి చెవిలో ఊదారు స్నేహితులెవరో.

ఒక పత్రికకు యిచ్చిన ఇంటర్వ్యూలో చెబుతూ "నేనో రావిశాస్త్రినో, కుటుంబరావునో అయితే తప్ప నా బాల్యపు దుఃఖావస్థలు నా కథల్లో కనబడకుండా వుండవు. నేను దాచుకోవాల్సిన దేమీలేదు. నాదుఃఖమో, నా కన్నీరో, ఎడతెగని నాకలలో నా తొలిరచనల్లో కనిపించేవి." అని ఆ జ్ఞాపకాల గురించి చెప్పకునేది.

◐◐◐

మెంటల్ హాస్పిటల్‌లో వున్న మాలతికి వ్యాధి ప్రకోపించిందని, దాదాపు ఇరవైదాకా ఎలక్ట్రిక్ షాకులు ఇవ్వాల్సి వచ్చిందని ఈమధ్యనే ఒక వార్త వచ్చింది. ఆమెను బెంగుళూరు హాస్పటల్ (ఆలిండియా ఇన్‌స్టిట్యూట్)కు తరలిస్తున్నట్టు కూడా వార్త. హాస్పిటల్‌కు వెళ్ళేముందు ఒక స్నేహితురాలికి రాసిన ఉత్తరంలో "నువ్వన్నానమ్మా! ప్రకాశం మానాన్నే! రమణి పాత్ర అమ్మే! కానీ వాళ్ళ జీవితాల్ని తరిచి చూసినాక, నాజీవితాన్ని తొంగిచూసుకున్నాక, ఈ ప్రపంచమంతా అబద్ధం, కేవలం దుఃఖం, అదీ స్త్రీల దుఃఖము మాత్రం నిజమనిపిస్తుంది. ఏళ్ళు గడిచినా మారని సత్యం యిది. వాడికి నీ శరీరం కావాలి, నీచర్మంలోంచి పుట్టే వేడికావాలి! అంతవరకే! హృదయం, అనుభూతి, స్పందన వాడి భాషలో ట్రాష్! ఒక నిజం చెప్పనా, ఇంతగా గ్లోరిఫైచేశానే ఈ ప్రకాశాన్ని. అదే సోకాల్డ్ మానాన్న! అతని జీవితంలో మాత్రం ఏముంది గొప్ప! అతని డైరీలోని ఒక పేజీని నవలలోకిరాకుండా జాగ్రత్త పడ్డాను! ఏవంటాడో తెలుసా? "ఒక కుటుంబం, నాదంటూ ఒక స్త్రీ, నాకంటూ ఒక పిల్ల వుంటే ఎంత బాగుండునో!" అదీ సంగతి. ప్రకాశంతో సహా మగవాళ్ళందరికీ 'స్త్రీ' అనే ఒక ఆస్తి కావాలి. అది వాడితోనే వుండి, వాడితోనే నశించాలి! డామ్ దిస్ మేల్ వరల్డ్! దీన్ని తగలెయ్యా!"

◐◐◐

ఈ సమీక్షకో చిన్న ముక్తాయింపు!

రత్నమాల తన యింటికి 'ఏకాంత' అని పేరు పెట్టుకొంది. ఇంటిముందు తనపేరు కింద అందంగా పెయింట్ చేసిన చిన్న కొటేషన్ వుంది. అది

"నేను వంటరిని
మీరు వంటరి
మనం పరస్పరం స్పర్శించుకొన్న క్షణాల్లో కూడా
మనతోపాటు మన వంటరితనం."